సాక్షి
ఒడిశా

శుక్రవారం । 26 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,73,151
బంగారం	420 మిల్లీ గ్రాములు
వెండి	40 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- IIలో▸

దేశవ్యాప్తంగా శుక్రవారం జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది.



ఆదివాసీల అభ్యున్నతే ధ్యేయం

రాష్ట్రంలో ఆదివాసీల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు.

- IIలో▸

న్యూస్‌రీల్

రాష్ట్రంలో ఫిబ్రవరి 3న పీఎం మోదీ పర్యటన



భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 3న ఒకరోజు పర్యటనకు రాష్ట్రానికి విచ్చేయనున్నారు. సంబల్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ హాజరుకానున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ బుధవారం తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో ప్రధాని మోదీ ఐఐఎం-ఎస్ క్యాంపస్‌ను సందర్శించాల్సింది. అనివార్య కారణాలతో ఆ పర్యటన వాయిదా పడింది. 2021 సంవత్సరంలో జనవరి 2న వర్చువల్ విధానంలో 200 ఎకరాల విస్తీర్ణంలో రూ.401 కోట్లతో అభివృద్ధి చేసిన క్యాంపస్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. తాజా రాష్ట్ర పర్యటనలో భాగంగా అనేక ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు కూడా ప్రధాని హాజరవుతారు. వాటి వివరాలు ఒకటి రెండు రోజుల్లో ఖరారు కానున్నాయని సామల్ తెలిపారు. మోదీ తన పర్యటనలో పార్టీ కార్యక్రమానికి కూడా హాజరవుతారని ఆయన చెప్పారు.

35 కిలోల గంజాయి స్వాధీనం



అరెస్టైన నిందితులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 35 కిలోల గంజాయిని బీఎస్‌పూర్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి హెచ్‌సీ సమంత్ తెలిపిన వివరాల మేరకు.. గజపతి జిల్లా మోహనా అటవీ ప్రాంతం నుంచి బరంపురం నగరానికి ఆటోలో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో బరంపురం బీఎస్‌పూర్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు 16వ నంబర్ జాతీయ రహదారి లంజిపల్లి బైపాస్ జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా అనుమానంతో ఒక ఆటోలో సోదాలు నిర్వహించగా గంజాయి బస్తా బయటపడింది. దీంతో ఆటోను సీజ్ చేసి, డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



తీవ్రగాయాలు పాలైన సాయికృష్ణ

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ రైల్వేస్టేషన్‌లో ఒక యువకుడు రైల్వే విద్యుత్ తీగను పట్టుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన అతడిని రైల్వే పోలీసులు సబ్ డివిజనల్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కొత్తూరు ప్రాంతానికి చెందిన జి.సాయికృష్ణ (34) అనే వ్యక్తి గుణుపూర్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు విశ్రాంతి తీసుకునే ప్రాంతంలో కూర్చున్నాడు. అదే సమయంలో పూరి నుంచి గుణుపూర్ వెళ్లే రైలు రాత్రి 9.30 గంటలకు స్టేషన్ చేరుకుంది. ట్రైన్ ఆగిన వెంటనే సాయికృష్ణ ట్రైన్‌పైకి ఎక్కి అక్కడ ఉండే విద్యుత్ తీగను తాకాడు. దీంతో అతని శరీరం కాలిపోయింది. వెంటనే తోటి ప్రయాణికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రంగప్రవేశం చేసిన సిబ్బంది అతడిని రక్షించి వెంటనే చికిత్స కోసం గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం వరకు గాయాలైన అతడిని మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు. అతను ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాడు అనే విషయం తెలియలేదు. పోలీసులు బంధువులకు సమాచారం అందించారు.

ప్రతిభకు పురస్కారం



సంతోష్ బాల, రాష్ట్ర హోమ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి | సంజుక్తా పట్నాయక్, కానిస్టేబుల్ | సత్యబ్రత భొయి, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు | బిజయ్ కుమార్ ప్రధాన్, సహాయ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ | ప్రదీప్ కుమార్ సామల్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ | ప్రశాంత కుమార్ సాహు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ | దిల్లీప్ కుమార్ నాయక్, డ్రైవర్ హావల్దార్



ఆరతి సాహు, కానిస్టేబుల్ | రజత్ కెర్కెట్టా, డిప్యూటీ కమాండెంట్ | సూరజ్ కుమార్ సాహు, సీటీ | సత్యబాది భుయ్, సీటీ | రమాకాంత సాహు, సబ్ ఇన్‌స్పెక్టర్ | బిశ్వజిత్ దాస్, కమాండో | సంజయ కుమార్ గురు, కమాండో



బుబున్ కుంభార్, కమాండో | ఉమేష్ , కమాండో | ప్రకాష్ మాఝీ , కమాండో | కన్హా బేటి, కానిస్టేబుల్ | రష్మి రంజన్ మహాపాత్రో, ఇన్‌స్పెక్టర్ | నామ్ బహదూర్ ఛెత్రి, సిపాయి | బనమాలి రే, సిపాయి



శారదా ప్రసన్న ప్రధాన్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ | నిరంజన్ సాహు, కమాండో | మోతీరామ్ సాహు, హావల్దార్ | అరుణ్ కుమార్ భూయి, సబ్ ఇన్‌స్పెక్టర్ | జాదుమణి భుయి, కమాండో | సత్య ఒడి, కానిస్టేబుల్ | లక్ష్మణ్ నాయక్, కానిస్టేబుల్

- రాష్ట్రపతి అవార్డులకు రాష్ట్రం నుంచి 33 మంది ఎంపిక

భువనేశ్వర్:

ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రదానం చేయనున్న రాష్ట్రపతి శౌర్య, విశిష్ట సేవ (పీఎస్‌ఎం), ప్రతిభావంతమైన సేవల (ఎంఎస్‌ఎం) పతకాలకు రాష్ట్రం నుంచి 33 మంది సిబ్బంది ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా 1,132 మంది పోలీస్, అగ్నిమాపక, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీస్ సిబ్బందిని ఈ పతకాలకు ఎంపిక చేశారు. ప్రతిష్టాత్మక రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం (పీఎస్‌ఎం)కు రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సంతోష్ బాలా, కానిస్టేబుల్ సంజుక్తా పట్నాయక్ ఎంపికయ్యారు. సంతోష్ బాలా ఒడిశా కేడర్‌కు చెందిన 1995 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఒడిశాకు చెందిన సివిల్ డిఫెన్స్ వాలంటీర్ జ్యోతి రంజన్ మహాపాత్ర కూడా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. 2004 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సత్యబ్రత భొయి రాష్ట్రపతి ప్రతిభావంతమైన సేవా పతకం (ఎంఎస్‌ఎం)కు ఎంపికయ్యారు. అలాగే వీరిలో పాటు మరికొంతమంది రాష్ట్రపతి పథకాలకు ఎంపికయ్యారు.

నాణేలు ఇస్తామని లూటీ



పోలీసులను ఆశ్రయించిన బాధితుడు సరోజ్ కుమార్

జయపురం: హనుమాన్ ముద్రతో ఉన్నటువంటి నాణేలు ఇస్తామని చెప్పి ఇద్దరు వ్యక్తులను లూటీ చేసిన ఘటన జయపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హనుమాన్ ముద్రతో ఉన్నటువంటి నాణేలు ఇస్తామని ఫోన్‌లో ఒక వ్యక్తి తెలియజేయడంతో బొలంగీర్ నుంచి సరోజ్ కుమార్‌తో పాటు మరో 5 మంది వ్యక్తులు కారులో బుధవారం సాయంత్రం జయపురం వచ్చారు.

అనంతరం తమకు ఫోన్‌చేసిన వ్యక్తికి వారు ఫోన్‌చేసి విషయాన్ని తెలియజేశారు. కానీ బొలంగీర్‌కు సరోజ్‌తో వచ్చినవారిలో నలుగురు వ్యక్తులు మరలా అదే కారులో వెళ్లిపోయారు. సరోజ్ కుమార్‌తో పాటు మరొక వ్యక్తి నాణేలు కోసం ఎదురుచూశారు. ఆ సమయంలో ఒక ఆటోలో 5 మంది దుండగులు వచ్చి వారిని నాణేలు ఇప్పిస్తామని చెప్పి జయపురం పవర్ హౌస్ ప్రాంతంలోని హనుమాన్ మందిరం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వీరిని భయపెట్టి 3 సెల్‌ఫోన్లు, నగదు రూ.8,700 బలవంతంగా తీసుకున్నారు. మరింత డబ్బు కావాలని డిమాండ్ చేశారు. కానీ వారి వద్ద ఇంకా డబ్బులు లేవని చెప్పినా విడిచిపెట్టలేదు. దీంతో పారాబెడ కూడలి వద్దనున్న ఒక హోటల్ బంగారం, డబ్బు ఉంచామని, అక్కడికి వస్తే ఇస్తామని చెప్పగా.. దుండగులు వారిని ఆటోలో పారాబెడ జంక్షన్‌కు తీసుకొచ్చారు. అక్కడ ఎదురుగా పోలీసుస్టేషన్ ఉండడంతో సరోజ్ ఆటో నుంచి దూకేశాడు. దీంతో మరో వ్యక్తిని తీసుకొని దుండగులు ఆటోలో వెళ్లిపోయారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దుండగుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.

రైలు ఢీకొని ఇద్దరు యువకులు మృతి



గ్రామస్తులతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు, పోలీసులు

- నష్ట పరిహారం ఇవ్వాలని గ్రామస్తుల ఆందోళన

రాయగడ: రైలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన సింగపూర్ రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మృతి చెందినవారు దేవదొలగుడ గ్రామానికి చెందిన అమిసిరావ్ పులక (24), శివన్న కద్రక (25)లుగా గుర్తించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి గురువారం ఉదయం చేరుకొని మృతదేహాలను తరలించేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్పందించిన రైల్వే అధికారులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ఇదీ విషయం...

వివరాల్లోకి వెళ్తే.. బుధవారం రాత్రి దేవదలగుడ గ్రామానికి చెందిన అమిసిరావు, శివన్నలు విజయనగరం-టిట్లాఘడ్ మూడో రైలు మార్గం నిర్మాణం పనుల్లో భాగంగా సింగపూర్ రోడ్డు సమీపంలో కొత్తగా నిర్మితమువుతన్న మూడో రైలు ట్రాక్ (లైన్)పై కూర్చున్నారు. ఈ మార్గంలో ఎటువంటి రైళ్లు రావని భావించిన వారు అక్కడ కాసేపు గడుపుదామనుకున్నారు. అయితే అదే సమయంలో ఆ మార్గంలో ట్రైల్ బేసిక్‌లో ట్రైన్‌ను నడిపిస్తుండగా



ట్రాక్‌పై మృతదేహాలు



ప్రమాదంలో మృతి చెందిన అమిసి రావ్, శివన్నలు (ఫైల్)

ట్రాక్‌పై ఉన్న ఇద్దరిని రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే వారి శరీరాలు తునాతునకలయ్యాయి. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న రైల్వే పోలీసులు గురువారం ఉదయం అక్కడికి చేరుకున్నారు. అప్పటికే గ్రామస్తులు అంతా సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలకు రైల్వే శాఖ నష్టపరిహారం చెల్లిస్తే గాని మృతదేహాలను తొలగించేదిలేదని పట్టుబట్టారు. రైల్వే ట్రాక్‌పై అసలు అలా కూర్చో కూడదని అధికారులు గ్రామస్తులకు నచ్చజెప్పారు. పై అధికారులకు విషయాన్ని తెలియజేసి బాధిత కుటుంబాలను అదుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

‘సమస్యలు పరిష్కరించాలని వినతి’

జయపురం: తమ గ్రామ సమస్యలను పరిష్కరించాలని జయపురం సమితి బయాగుడ గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కమ్యూనిస్టు నేత రామకృష్ణ దాస్ నేతృత్వంలో సబ్ కలెక్టర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఒక వ్యక్తిపై తీవ్ర ఆరోపణలు చేశారు. సదరు వ్యక్తి గ్రామంలో ఒకరి ఇంటిని తగలబెట్టి ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నాడని పేర్కొన్నారు. ఆవాస్ యోజనలో గ్రామ ప్రజలకు వచ్చిన డబ్బు స్వాహా చేసి సొంతంగా ఇల్లు కట్టుకున్నాడన్నారు. ప్రభుత్వ భూమిలో ఫార్మ్‌హౌస్ ఏర్పాటు చేశాడని, అంతేకాకుండా ప్రభుత్వ భూమిని అమ్మివేశాడని దుమ్మెత్తిపోశారు. ఆధార్ కార్డులు తీసుకుంటూ వ్యవసాయ రుణాలు ఇప్పిస్తామని మోసం చేస్తూ, డబ్బు స్వాహా చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ స్పందించి ఆరోపణలపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో రామ్‌నాగ్, కమల లోచన హరిజన్, నంద హరిజన్, సుందర నాగ్, అర్జున హరిజన్ తదితరులు ఉన్నారు.

కదంతొక్కిన కన్నుగుడ

- ఆందోళన బాటలో గ్రామస్తులు



కాలి నడకన వస్తున్న వృద్ధులు



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

రాయగడ: తమ గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కాసీపూర్ సమితి గోరఖ్‌పూర్ పంచాయతీలోని కన్నుగుడ గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. దీనిలో భాగంగా గ్రామానికి సుమారు 20 కి.మీ దూరంలో ఉన్నటువంటి కాసీపూర్ సమితి కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. గ్రామంలోని వృద్ధులు, విద్యార్థులు, చిన్నారులు సైతం కార్యాలయం వద్దకు కాలి నడకన చేరుకున్నారు. సుమారు రెండేళ్లుగా విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, సాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించకుంటే సామూహికంగా ఆత్మహత్యకు పాల్పడతామని హెచ్చరించారు. ఈ మేరకు వారంతా భారత రాష్ట్రపతి పేరిట ఒక వినతిపత్రంను సమితి అధికారులకు సమర్పించారు. గ్రామ సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చిన తర్వాతే ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు. శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తామని తెలియజేశారు.



సమితి కార్యాలయానికి కాలి నడకన వెళ్తున్న గ్రామస్తులు



అభివృద్ధి జాడలేని కన్నుగుడ గ్రామం ఇదే

కాంగ్రెస్ మద్దతు

సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట పట్టిన గ్రామస్తులకు కాంగ్రెస్ తన మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, ఆయన సతీమణి పూజా ఉలక, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా పండ, ఆ పార్టీ సీనియర్ నాయకుడు అప్పల స్వామి కద్రకలతో పాటు కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని సమితి కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఏళ్లు గడిచినా ఈ ప్రాంత ప్రజల జీవితాలు ఏమాత్రం మారలేదని సప్తగిరి ఉలక ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు గ్రామస్తులకు అండగా ఉంటామని తెలియజేశారు.



గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

సీఐల బదిలీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖకు సంబంధించిన ఇన్‌స్పెక్టర్లను స్థానచలనం చేస్తున్నట్లు విశాఖపట్నం రేంజి కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం డీఎస్‌బీ సీఐగా ఉన్న గింద్రి దాలిబాబు విశాఖపట్నం సిటీకి, ఆమదాలవలస సీఐ పి.పైడయ్య టెక్కలి అర్బన్ పీఎస్‌కు, విశాఖపట్నం రేంజి వీఆర్‌లో ఉన్న జి.దివాకర్ వాయునందన్ ఆమదాలవలస సీఐగా బదిలీ అయ్యారు.

ఎస్‌ఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం రేంజి కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు ఎస్‌ఐలకు స్థానచలనం చేస్తున్నట్లు జిల్లా సూపరింటెండ్ ఆఫ్ పోలీసు కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదలైంది. ఈ మేరకు ఆమదాలవలస ఎస్‌ఐ వై.కృష్ణ, నరసన్నపేట ఎస్‌ఐ సింహాచలంలు విశాఖపట్నం సిటీకి, విశాఖ సిటీ (ద్వారక క్రైమ్, న్యూపోర్టు క్రైమ్) నుంచి సరుబుజ్జిలి, బూర్జ పీఎస్‌లకు బి.నిహార్, జి.ప్రసాద్‌లు బదిలీపై రానున్నారు.

యశోదమ్మ నేత్రాలు సజీవం


యశోదమ్మ


శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళానికి చెందిన ప్రముఖ వైద్యులు గండి విద్యాసాగర్ మాతృమూర్తి గండి యశోదమ్మ (80)గురువారం మృతి చెందారు. ఆమె కుమారుడు విద్యాసాగర్ తల్లి మరణానంతరం కూడా మరో ఇద్దరికి చూపు ఇవ్వాలని ఆలోచనతో ఆమె రెండు కళ్లను దానం ఇవ్వాలని నిర్ణయించుకుని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా ఆమె కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి అందించారు. నేత్రదానం చేసిన దాత కుటుంబ సభ్యులను చైర్మన్ అభినందించారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వాళ్లు 7842699321 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు నలుగురు ఎంపిక


జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఈఓ, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్కూల్‌గేమ్స్ అండర్-14 బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో జెడ్పీహెచ్ స్కూల్ ఇప్పిలికి చెందిన బి.రాజేష్, జి.వెన్నెల, కె.దేవి, జెడ్పీహెచ్‌స్కూల్ లావేరుకు చెందిన ఎ.అనిల్‌కుమార్ ఉన్నారు. ఈ పోటీలు ఈనెల 28 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు రాయ్‌పూర్‌లో జరగనున్నాయి. వీరు నలుగురు ఎస్‌జీఎఫ్ ఆంధ్రప్రదేశ్ బాల బాలికల జట్టు తరఫున జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. కాగా ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు గురువారం సాయంత్రం తన చాంబర్‌లో అభినందించారు. జాతీయ పోటీల్లో క్రమశిక్షణగా పట్టుదలతో ఆడి, విజయబావుటా ఎగుర వేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పీఈటీ సంఘ ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.రవికుమార్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

‘నవభారత సాక్షరత’పై కేంద్ర బృందం క్షేత్ర పర్యటన


వివరాలను సేకరిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

గార: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలుచేయనున్న న్యూ ఇండియా లిటరసీ ‘నవ భారత సాక్షరత’ కార్యక్రమం అమలు, నూతన పుస్తకాల తయారీపై కేంద్రబృందం జిల్లాలో క్షేత్ర పర్యటన జరిపింది. వైఎస్సార్ చేయూత, కాపునేస్తం వంటి పథకాల లబ్ధిదారులైన మహిళలతో సమావేశం నిర్వహించింది. గురువారం రామచంద్రాపురంలో స్థానిక మహిళలు, సచివాలయ సిబ్బందితో న్యూఢిల్లీకి చెందిన సభ్యులు శివశ్రీ వాత్సవ్ హర్షిత, రిచా దిహార్‌లు మాట్లాడారు. వయోజన విద్యలో భాగంగా సమాజంలో వచ్చిన మార్పు, నిరక్షరాస్యులకు, పదో తరగతి వరకు చదువుకున్నవారు, ఇంటర్ వంటి చదువు తర్వాత ఆగిన వారికి అవసరమైన పుస్తకాల తయారీకి సబ్జెక్టు అవసరాలపై మహిళలతో మాట్లాడారు. ఎన్‌సీఈఆర్‌టీకి అవసరమైన పరిజ్ఞానాన్ని అందించేందుకు అన్ని జిల్లాలో పర్యటిస్తున్నామన్నారు. శ్రీకూర్మం పంచాయతీలోనూ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, వయోజన విద్య డీడీ ముద్దాడ వెంకటరమణ, సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, గోరు అనిత,ఏఎస్‌వో బాల చందర్, ఏడీ వైకుంఠరావు, యాళ్ల నారాయణ మూర్తి, సెక్రటరీలు ఎం. రాము, చెట్టు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.




నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

ఆదివాసీల అభ్యున్నతే ధ్యేయం


వేదికపై మంత్రి సరక, అనసూయ తదితరులు

- మంత్రి జగన్నాథ సరక
- రాయగడలో సాంస్కృతిక ఉత్సవాలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి


కార్యక్రమానికి హాజరైన గిరిజనులు

రాయగడ: రాష్ట్రంలో ఆదివాసీల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. స్థానిక తేజస్విని మైదానంలో ప్రత్యేక అభివృద్ధి మండలి (ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలియజేశారు. దీనిలో భాగంగా ఆదివాసీలు అత్యధికంగా నివసించే 24 జిల్లాల్లో ఎస్‌డీసీ సంస్థలను ప్రారంభించి, ఆయా సంస్థల ద్వారా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు చేపడుతున్నట్లు తెలియజేశారు. ఆదివాసీల భాష, సంస్కృతి, కళలను పరిరక్షించడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. ఆయా రంగాల్లో వారిని ప్రోత్సహించేందుకు ప్రతీ సమితిలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి మాట్లాడుతూ ఎస్‌డీసీ ద్వారా ఆదివాసీ గ్రామాల్లో ఇప్పటికే అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. అదేవిధంగా యువత అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌సీసీ వైస్ చైర్మన్ బనమాలి కద్రక, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, ఉపాధ్యక్షుడు హరప్రసాద్ హెప్రుక, అమో ఒడిశా నవీన్ ఒడిశా కొరాపుట్ జిల్లా సమన్వయకర్త లత రాయ్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం


బరంపురం: బాపుర్ బజార్‌లో జాతీయ పతాకాల అమ్మకాలు

బరంపురం: దేశవ్యాప్తంగా శుక్రవారం జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు బరంపురం నగరంలో సందడి వాతావరణం నెలకొంది. స్థానిక బాపుర్ బజార్, అన్నపూర్ణ మార్కెట్, చిన్నా బజార్, పెద్ద బజార్, గిరి మార్కెట్‌లలో జాతీయ పతాకాలు, స్టిక్కర్స్ అమ్మకాలు గురువారం జోరుగా సాగాయి.

హోటళ్లలో తనిఖీలు

భువనేశ్వర్: రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని నగరంలో భద్రతా వ్యవస్థ పటిష్టపరిచారు. నగర కమిషనరేట్ పోలీసులు వివిధ హోటళ్లలో గురువారం తనిఖీలు చేపట్టారు. ఒక ప్లాటూన్ పోలీసు బలగాలు, 60 మంది సిబ్బంది, అధికారుల నేతృత్వంలో నగరంలోని వివిధ ప్రదేశాల్లోని హోటళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మాస్టర్ క్యాంటీన్, కటక్ రోడ్, ఖారవేళ నగర్, బర్‌గడ్, చంద్రశేఖర్‌పూర్, ఖండగిరి, ఇన్ఫోసిటీ ప్రాంతాల్లోని హోటళ్లలో పోలీసు బృందాలు తనిఖీలు చేపట్టారు. జంట నగరాలు భువనేశ్వర్, కటక్ కమిషనరేట్ పోలీసుల సేఫ్ సిటీ డ్రైవ్ కింద భువనేశ్వర్ డీసీపీ ఆదేశాల మేరకు ఈ సోదాలు చేపట్టారు.

కొరాపుట్: జిల్లా కేంద్రంలో జరగనున్న వేడుకల్లో పాల్గొనడానికి రాష్ట్ర క్రీడలు, ఐటీ, హోమ్ శాఖ మంత్రి తుషార్ కాంతి బెహరా కొరాపుట్ చేరుకున్నారు. గురువారం సాయంత్రం స్పెషల్ సర్క్యూట్ హౌస్‌కి వచ్చారు. మంత్రికి కొరాపుట్ ఎమ్మెల్యే, జిల్లా ప్రణాళికా సంఘం అధ్యక్షుడు రఘురాం పాడాల్, కొరాపుట్ పురపాలక సంఘ అధ్యక్షుడు లలెటెందు రంజన్ శెఠిలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పార్టీ నాయకులతో జిల్లాలో పార్టీ పరిస్థితిపై సమాలోచనలు జరిపారు.

కర్తవ్య పథంలో రాష్ట్ర శకటం



కందర్ప హత్తి శకటం

భువనేశ్వర్: పూరీ జిల్లా వారసత్వ హస్తకళ గ్రామం రఘురాజ్‌పూర్ నుంచి క్లిష్టమైన కళ పట్టచిత్ర ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న రాష్ట్ర శకటం కందర్ప హత్తి శుక్రవారం న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్‌లో కర్తవ్య పథంలో ప్రదర్శితం కానుంది. ఇప్పటివరకు జాతీయ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రం ప్రవేశపెట్టిన పలు శకటాలు ప్రదర్శనలో బహుమతులు గెలుచుకున్నాయి. 1952 సంవత్సరం న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఒడిశా శకట ప్రదర్శనలో అరంగేట్రం చేసింది.

కందర్ప హత్తి

45 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పు, 16 అడుగుల ఎత్తు ఉన్న శకటం ఇది. పూరీ జిల్లా వారసత్వ హస్తకళ గ్రామం సారాంశాన్ని, దాని కళాత్మక వారసత్వాన్ని సంగ్రహిస్తూ మహిళా సాధికారతను ప్రదర్శిస్తుంది. ప్రముఖ పట్టచిత్ర కందర్ప హత్తి కృష్ణ లీలని వర్ణించే చిత్రం. దీనిలో 9 మంది స్త్రీలు ఏనుగు ఆకారంలో ఒకరితో ఒకరు అల్లుకుని ఉన్నట్లు చిత్రీకరించడం విశేషం. దీనిని ప్రముఖ కళాకారులు గజేంద్ర సాహు, కీర్తి కిషోర్ మహరణ రూపొందించారు. ఈ శకటంతో పాటు సంబల్‌పురి పాట కూడా ఉంటుంది. రఘురాజ్‌పూర్‌లోని ప్రతి కుటుంబంలో మహిళలు స్థానిక హస్తకళతో తమను తాము ఎలా శక్తివంతం చేసుకుంటున్నారో, ఆర్థికంగా స్వతంత్రులుగా ఎలా మారుతున్నారో శకటంలో కళాకారులు పొందుపరిచారు. కందర్ప హత్తి వారిని అపారమైన శక్తితో బలమైన రక్షకునిగా చిత్రీకరించే ప్రయత్నమని కళాకారులు మీడియాకు తెలిపారు. ఈ సంవత్సరం 16 రాష్ట్రాల నుంచి శకటాలు కవాతులో పాల్గొనేందుకు ఆమోదం పొందాయి. వీటిలో ఒడిశాకు ప్రాతినిధ్యం వహిస్తున్న కందర్ప హత్తి మేటిగా నిలుస్తుందని ఆశిస్తున్నారు.

సాగునీటి సంఘాలతో రైతులకు మేలు


ముగింపు సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

- వంశధార, నాగావళి అదనపు చీఫ్ ఇంజినీర్ నాగేంద్ర కుమార్

పర్లాకిమిడి: సాగునీటి సంఘాల ద్వారా రైతులకు మేలు జరుగుతుందని వంశధార, నాగావళి అదనపు చీఫ్ ఇంజినీర్ నాగేంద్ర కుమార్ మహర్దీ అన్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాల్‌లో గురువారం జరిగిన జిల్లా స్థాయి సాగునీటి సంఘాల పక్షోత్సవాలు ముగింపు సమావేశాన్ని జల సంపద విభాగం చీఫ్ ఇంజినీర్ సంజీవ్ కుమార్ దాస్ శర్మ ప్రారంభించారు. సాగునీటి సంఘాల ద్వారా ఈ ఏడాది ఐదు నుంచి ఆరువేల హెక్టార్ల భూమికి సాగునీటిని అందజేయగలమని బలరాం సుబుద్ధి అన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులకు కారణం చెట్లు అంతరించిపోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సాగునీటి సంఘాలు, ఎత్తిపోతల పథకాలు పునరుద్ధరించాలని, రామసాగరం, గజపతి సాగరం, కృష్ణ సాగరం పనులకు నిధులు మంజూరైనా, పనులు ప్రారంభించలేదని జెడ్పీ చైర్మన్ గవర తిరుపతిరావు అన్నారు. ఆర్.ఉదయగిరి, మోహనాలో ఈ ఏడాది కాఫీ పంట రైతులకు లాభాలు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి సరోజ్‌కుమార్ సాహు అన్నారు. అనంతరం ఆర్.శెట్టి భవనం ఆవరణలో సెంచూరియన్ పబ్లిక్ స్కూల్, సరస్వతీ శిశు విద్యామందిర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రాజెక్టుల ప్రదర్శనను అధికారులు పరీక్షించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుశాంత రంజన్ దాస్, ప్రభుత్వ జిల్లా వ్యవసాయ అధికారి శుభశ్రీ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.


వర్షపు నీటిని ఒడిసి పట్టడంపై వివరిస్తున్న సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని


సమతుల్య పర్యావరణంపై ప్రాజెక్టు

ఇంటి వద్దే ఓటు

- వృద్ధులు, దివ్యాంగులు, రోగులకు అవకాశం

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికల కోసం ఎన్నికల సంఘం సరికొత్త ఏర్పాట్లు చేసింది. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న ఓటర్లు ఇంట్లోనే ఉండి ఓటు వేసే వెసులుబాటు తీసుకొస్తోంది. 80 ఏళ్లు పైబడిన వయో వృద్ధులు, 40 ఏళ్లలోపు దివ్యాంగులు, అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్న వారికి ఇంటి వద్ద ఓటు విధానం వర్తిస్తుంది. దీంతో పాటు పోలింగ్‌కు సంబంధించిన అధికారులు, సిబ్బంది అందరూ విధులు నిర్వహిస్తున్న చోటే ఓటు వేసేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.

ముమ్మరంగా ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నికుంజ బిహారీ ధోల్ తెలిపారు. అన్ని జిల్లాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) చేరడంతో పరీక్షల నిర్వహణ పూర్తయ్యిందన్నారు. పోలింగ్ మొదటి, రెండో దశ సన్నాహాలు పూర్తయినట్లు వెల్లడించారు. మూడో దశ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి, పోలీసు సిబ్బంది, వాహన సిబ్బందితో సహా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది తమ తమ విధి నిర్వహణ ప్రాంతాల్లో ఓటు వేయవచ్చు. ఈ మేరకు అనుబంధ సౌకర్యాల కోసం విస్తృత ఏర్పాట్లు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో లోక్‌సభకు, రాష్ట్ర శాసన సభకు ఏకకాలంలో ఎన్నికలు జరుగనున్నాయి. పోలింగ్, లెక్కింపు, ఫలితాల ప్రకటన ప్రక్రియ ఆద్యంతాలకు వీలుగా భారత ఎన్నికల సంఘం ఈ ఏడాది ఏప్రిల్ 16 తాత్కాలిక పోల్ డేగా కేటాయించింది.

విస్తారంగా వర్షం


బరంపురం నగరంలో కురుస్తున్న వర్షం


రాష్ట్ర రాజధానిలో తీవ్రంగా కురుస్తున్న మంచు


16వ నంబర్ జాతీయ రహదారిపై చలికాగుతున్న లారీ డ్రైవర్లు

బరంపురం: రాష్ట్రంలో బుధవారం రాత్రి పలుచోట్ల విస్తారంగా వర్షం కురిసింది. దీంతో చలి తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జాతీయ రహదారుల్లో అధికంగా మంచు కురుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పాలైయ్యారు. రహదారులపై వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేశారు.

బొరిగివలసలో చోరీ



ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

నరసన్నపేట: మండలంలోని పెద్దబొరిగివలసలో యడ్ల రమేష్ అనే రైతు ఇంటిలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించి బీరువా తెరిచి బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ. 68 వేలు నగదును చోరీ చేశారు. పట్టపగలే ఈ చోరీ జరగడంతో పోలీసులు, గ్రామస్తులు నివ్వెర పోతున్నారు. తమ గ్రామంలో ఇప్పటి వరకూ ఇటువంటి చోరీలు జరగలేదని గ్రామస్తులు బగ్గు రమణయ్య, రాజాపు అప్పన్నలు తెలిపారు. రైతు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, నాలుగు తులాల వెండి వస్తువులతో పాటు రూ. 68 వేలు నగదు చోరీకి గురైంది. ఉదయం రమేష్‌తో పాటు భార్య నిర్మల పొలం పనులకు వెళ్లారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నిర్మల పొలం నుంచి ఇంటికి వచ్చే సరికి ఇంటి ప్రధాన ద్వారం గెడ తీసి ఉంది. వేసిన తాళం విరగ్గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూస్తే బీరువా తెరిచి ఉండడంతో వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం అందజేశారు. వెంటనే ఇరుగు పొరుగు వారు వచ్చి పరిశీలించి దొంగలు పడి వస్తువులు తీసుకుపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పండిన ధాన్యం డబ్బులు రావడంతో బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు రెండు రోజుల కితమే విడిపించామని, ఇంతలో దొంగతనం జరిగి ఇల్లు గుల్ల అయ్యిందని నిర్మల కంట నీరు పెట్టుకున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకొని చోరీకి గురైన ఆభరణాలు గుర్తించి అప్పగించాలని కోరుతున్నారు. కాగా బీరువాలో రెండు తులాల జడగంటలు ఉన్నా అవి రోల్డ్‌గోల్డుగా భావించిన దొంగలు వాటిని తీసుకువెళ్లలేదు. చోరీ సమాచారం తెలుసుకున్న సీఐ బి.ప్రసాదరావు, ఎస్‌ఐ సింహాచలంలు ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి వేలి ముద్రలు సేకరించారు. దొంగతనానికి పాల్పడింది స్థానికులుగానే పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా దొంగతనానికి గురైన ఇల్లు నివాసాలకు దూరంగా ఉండటంతో గ్రామస్తులు ఎవరూ గుర్తించలేక పోయారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

నరసన్నపేట: స్థానిక బండి వీధిలో నివాసం ఉంటున్న కోట్ని కళావతి కుమారుడు కోట్ని రాకేష్ (23) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. రాకేష్ నరసన్నపేట బజారు వీధిలోని ఒక బంగారం షాపులో కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తుండగా తల్లి కళావతి పెద్దపేటలోని ఒక హోల్‌సేల్ దుకాణంలో పనిచేస్తున్నారు. ఉదయం వరకూ బాగానే ఉన్న రాకేష్ ఉన్నఫలంగా ఇలా ఆత్మహత్యకు ఎందుకు పాల్పడ్డాడో తెలియడం లేదు. బంగారు దుకాణంలో లావాదేవీలే కారణమని తెలుస్తోంది. బంగారం షాపులో నగదు లెక్కల్లో లక్ష రూపాయలు తేడా రావడం రాకేష్‌పై షాపు యజమానులు అనుమానించడంతో మనస్తాపానికి గురై ఈ చర్యకు పాల్పడి ఉంటాడని తల్లి కళావతి అనుమానిస్తున్నారు. పని నుంచి సాయంత్రం ఇంటికి వచ్చిన కళావతి తలుపు తెరిచే సరికి కుమారుడు ఉరికి వేలాడి కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపించి స్థానికులకు సమాచారం ఇచ్చారు. నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు, ఎస్‌ఐ వై. సింహాచలం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తల్లితో మాట్లాడి వివరాలు సేకరించారు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారులో ఏడు కిలోల గంజాయి స్వాధీనం


గంజాయితో నిందితుల్ని పట్టుకున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్

మందస: ఒడిశా నుంచి కేరళ వైపు వెళ్తున్న కారులో మందస పోలీసులు ఏడు కిలోల 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన వ్యక్తి నుంచి కొనుగోలు చేసిన గంజాయిని కేరళకు చెందిన ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్తుండగా.. మందస మండలంలోని కొత్తపల్లి జాతీయ రహదారిపై పోలీసులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మందస ఎస్‌ఐ ఎ.అనిల్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కేరళకు చెందిన బినేష్ బాలకృష్ణ అనే 24 ఏళ్ల యువకుడు కేరళ నుంచి ఒడిశా రాష్ట్రంలో బరంపురానికి ఇటీవల వచ్చాడు. స్టేడియం ప్రాంతంలో గోళీ సోడాలు అమ్ముతున్న బుల్లు మజ్జి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. గంజాయి తన వద్ద ఉందని బుల్లు చెప్పి, శాంపిల్ చూపించడంతో రుచి మరిగిన బినేష్ బాలకృష్ణ ఆయన స్నేహితుడైన అజ్మల్‌కు విషయాన్ని చెప్పాడు. దీంతో వీరిద్దరు బరంపురం చేరుకుని, గంజాయి కావాలని ముందే సమాచారం ఇవ్వడంతో పుల్బాణి నుంచి తెప్పించిన బుల్లు వీరిద్దరికీ అందించాడు. కారులో ముగ్గురూ బరంపురం నుంచి వస్తుండగా.. కొత్తపల్లి జాతీయ రహదారిపై పోలీసులకు పట్టుబడ్డారు. తనిఖీల్లో భాగంగా కారును పరిశీలించగా, అసలు బండారం బయటపడింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని, ఈ ముగ్గురిని అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ అనిల్‌కుమార్ చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఐతో పాటు ఏఎస్‌ఐ కె.శేఖారావు, హెచ్‌సీ వై.గవరయ్య, పీసీలు ఎస్.రవికుమార్, టి.నేతాజీ, పంచాయతీ కార్యదర్శి రోక్కళ్ల సింహాద్రి, వీఆర్వో ఇప్పిలి భవానీ ఉన్నారు.

క్లుప్తంగా

బొడ్డగూడ బీఎల్ఓకు రాష్ట్రస్థాయి అవార్డు


చందన కుమారి

భామిని: మండలంలోని బొడ్డగూడ బూత్‌లెవల్ అధికారి పి.చందనకుమారికి ఓటర్ల నమోదులో ఉత్తమ సేవలందించినందుకు జాతీయ ఎన్నికల కమిషన్ రాష్ట్ర స్థాయి అవార్డు ప్రకటించిందని తహసీల్దార్ నీలాపు అప్పారావు గురువారం తెలిపారు. అవార్డును రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అందుకున్నారన్నారు.

పాదయాత్రగా పండాపూర్-పూరి

సీతంపేట: లోకకళ్యాణార్థం మహారాష్ట్రకు చెందిన ఏడుగురు తీర్థయాత్రికులు వెయ్యి కిలోమీటర్ల మేర దూరంలోని పూరికి పాదయాత్రగా బయలుదేరారు. వీరు గురువారం సీతంపేటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ నెల రోజుల కిందట మహారాష్ట్రలోని పండాపూర్‌లో బయలుదేరామని, పూరికి నడుచుకుంటూ వెళ్తున్నట్టు యాత్రికులు మహాజన్‌బాగ్, కురేషిలు తెలిపారు. జగన్నాథుని దర్శనంతో పాదయాత్ర ముగుస్తుందన్నారు. మధ్యలో పలు ఆలయాలను దర్శించుకుంటున్నామన్నారు.

శతశాతం ఫలితాలే లక్ష్యం

- గురుకులాల జిల్లా కన్వీనర్ పద్మజ

వంగర: జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ఈ ఏడాది శతశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు జిల్లా గురుకులాల సమన్వయకర్త తోట పద్మజ అన్నారు. మడ్డువలస డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, బోధన, అభ్యసన తీరును పరిశీలించారు. మెనూ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 8 గురుకులాల్లో చదువుతున్న 603 మంది పదోతరగతి విద్యార్థులు, ఇంటర్మీడిట్ ఫస్టియర్ 306 మంది, సెకెండియర్ 344 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారన్నారు. వీరందరికీ తరగతులు వారీగా ప్రత్యేక చదువు ప్రణాళిక అమలు చేస్తున్నట్టు చెప్పారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

2024-25 విద్యాసంవత్సరంలో ఐదోతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా గురుకులాల సమన్వయకర్త తోట పద్మజ తెలిపారు. అన్ని గురుకులాల్లోనూ దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హత గల విద్యార్థులు ఫిబ్రవరి 23వ తేదీలోగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. మార్చి 10వ తేదీన ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, సిబ్బంది ఉన్నారు.

వంగరలో నగదు చోరీ

వంగర: మండల కేంద్రం వంగరలో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కోరాడ సూరమ్మ ఇంట్లో దాచుకున్న సుమారు రూ.1లక్ష నగదు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు వంగర పోలీసులు తెలిపారు. సూరమ్మ సిమెంట్ పనుల కోసం వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ప్రవేశించి తన సొమ్మును దొంగిలించారని బాధితురాలు వంగర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీమ్ సంఘటనా స్థలంలో వివరాలు సేకరించింది.

139 మొబైల్స్ బాధితులకు అందజేత

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 139 మొబైల్స్‌ను ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో ట్రేస్ చేయగా వాటిని డీఎస్పీ ఆర్.గోవిందరావు తన కార్యాలయంలో బాధితులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ సెల్ పోలీసులకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోయిన మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు సైబర్‌సెల్ పోలీసులు, సిబ్బంది నిరంతరం చర్యలు చేపడుతున్నారన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ల గురించి ఫిర్యాదుచేసిన కొద్దిరోజుల్లోనే పోగొట్టుకున్న 139 మొబైల్ ఫోన్లను సైబర్ సెల్ పోలీసులు ట్రేస్ చేశారని చెప్పారు. వాటిని బాధితులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో సైబర్‌సెల్ ఎస్సైలు ప్రశాంత్ కుమార్, నసీమా బేగం, సైబర్‌సెల్ కానిస్టేబల్స్ వాసుదేవ్, శ్రీనివాసరావు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లా నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించేందుకు ఉచిత శిక్షణ తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ వసతి గృహంలో నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్ జీబీవీరమణ తెలిపారు. యువకులకు టూ వీలర్ మెకానిజం కోర్సులో ఈ నెల 4వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఉంటుందని, వసతి, భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు తెల్లకార్డుదారులు, 45 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత యువకులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తులను తమ కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 9959521662, 9985787820 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సేవా కేంద్రంగా సహకార సంఘం

- కో ఆపరేటివ్ సొసైటీల్లో బహుళ సేవలు
- జిల్లాలో 12 జనరిక్ ఔషధ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రతి సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్


నందిగాంలో పీఏసీఎస్ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్

విజయనగరం అర్బన్: సహకార రంగాన్ని గత తెలుగుదేశం ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ రంగం దశ మారింది. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సహకార రంగాన్ని బలోపేతం చేసి వాటి తలరాతను మార్చేశారు. సహకార పరపతి కేంద్రాల ద్వారా పలురకాల సేవలు రైతులు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో జనరిక్ మందుల షాపులు, పెట్రోల్ బంకుల ఏర్పాటు ఆధార్‌లో మార్పులు, చేర్పులు, పాన్‌కార్డు, అలాగే 1బి, అడంగల్ సర్టిఫికెట్లు ఇలా వివిధ రకాల సేవలు అందిస్తూ సేవలను విస్తృతం చేశారు. ఒకప్పుడు పరిమిత సేవలందించే సహకార సంఘాలు నేడు రైతుల అవసరాలు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వాణిజ్య సరళిలో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. బహుళ సేవలను సహకార పరపతి కేంద్రాల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చాయి. అందులో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో 5 జనరిక్ ఔషధ కేంద్రాలు, 4 పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రెండు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారు.

జనరిక్ ఔషధ కేంద్రాలు..

ప్రధాన మంత్రి జనరిక్ ఔషధ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తోంది. వాటిని గ్రామీణ ప్రాంతాల్లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా తొలివిడతగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో 12 సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)ను ఎంపిక చేసింది. వాటిలో నెల్లిమర్ల మండలంలోని సతివాడ, రామభద్రపురం, మెంటాడ, పార్వతీపురం, మక్కువ పీఏసీఎస్‌లలో 5 జనరిక్ ఔషధ కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించారు.

250 రకాల సేవలు..

సహకార పరపతి సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గతంలో రైతులు, ప్రజలకు ఏదైనా సర్టిఫికెట్ 1బి, అడంగల్, ఆధార్‌లో మార్పులు, చేర్పులు, పాన్‌కార్డు వంటి సేవలు కావాలంటే మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో మీ సేవ నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేసి దోపిడీకి పాల్పడే వారు. వాటికి చెక్‌పెట్టేలా ప్రతి సహకార పరపతి సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేసి 250 రకాల సేవలను అందిస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా 94 సహకార పరపతి సంఘాలు ఉండగా ఇప్పటికే 93 కేంద్రాల్లో సీఎస్‌సీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సూపర్‌బజార్లు, టెంట్‌హౌస్‌లు, క్లాత్ బిజినెస్ నిర్వహిస్తోంది. గొడౌన్లు, బిల్డింగ్‌ల నిర్మాణానికి సంబంధించి పనులను పూర్తి చేశారు.

సహకార రంగం బలోపేతం

సహకార రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. సహకార రంగం అభివృద్ధి వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. పంట ఉత్పత్తులపై ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నాం. సహకార రంగ సేవలు గ్రామీణ ప్రాంతాల వారికి మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

– కె.జనార్దన, డీసీసీబీ సీఈఓ

పెట్రోల్ బంకుల నిర్వహణ

ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు జిల్లా సహకార శాఖ పెట్రోల్ బంకుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లాలో 4 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే తెర్లాం మండలంలో నందిగాం, పెరుమాళి గ్రామాల్లో ఒక్కో పెట్రోల్ బంకును ఏర్పాటు చేశారు. మిగిలిన కేంద్రాల్లో ప్రతిపాదనలు చేశారు.

ఏజెన్సీలో డిజిటల్ విప్లవం

- గిరిజనులకు అందుబాటులో నెట్ సేవలు
- సెల్ టవర్లను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి


వర్చువల్ విధానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మొబైల్ టవర్ల ప్రారంభోత్సవాన్ని తిలకిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పార్వతీపురం/కురుపాం/జియ్యమ్మవలస: పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్మాణం పూర్తయిన మొబైల్ టవర్లను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జియ్యమ్మవలస మండలం పీటీ మండ, కురుపాం మండలం గంగన్నదొరవలస గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ టవర్ల ఏర్పాటులో డిజిటల్ విప్లవం వచ్చి గొప్ప మార్పునకు నాంది పలికిందన్నారు. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్(యుఎస్ఓఎఫ్) కింద రాష్ట్రంలో నిర్మించిన 400 టవర్లను ప్రారంభించామన్నారు. రూ.3,119 కోట్లతో 2900 టవర్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. సిగ్నల్ అందని ప్రాంతం ఉండకూడదన్న ప్రధాన లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

టవర్ల ఏర్పాటుతో నూతన శకం

జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ మొబైల్ టవర్ల ఏర్పాటుతో జిల్లాలో నూతన శకం ప్రారంభమైందన్నారు. జిల్లా వ్యాప్తంగా 4జీ కవరేజీ వస్తుందని తెలిపారు. రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన 60 టవర్లకు అటవీ శాఖ అనుమతులు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో 196 టవర్లను ఏర్పాటు జరుగుతుందని, ఇందుకు రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. టవర్ల ఏర్పాటుతో గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న దాదాపు 40 వేల మందికి డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. టవర్ల ఏర్పాటు మన్యం ప్రజలకు ఒక వరంగా పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం నుంచి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది, గ్రామ పౌరుల వరకు నెట్‌వర్క్ కష్టాలు తొలగాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేరవవుతున్నట్టు వెల్లడించారు. గిరిజన ప్రజలు కొండ దిగకుండానే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఫోన్‌ద్వారా తమ సమస్యలు చెప్పగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో పీటీ మండకు చెందిన గిరిజనుడు ఆరిక చలపతిరావు సీఎంతో మాట్లాడుతూ మాకు ఇప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. సెల్ టవర్ల ఏర్పాటుతో ఏజెన్సీలో సిగ్నల్ సమస్యలు తొలగాయని, విద్య, వైద్య సేవలు అందుతున్నాయని, బంధువులతో వీడియో కాల్‌లో మాట్లాడగలుగుతున్నామని, సచివాలయ సేవలు చేరువయ్యాయని తెలిపారు. మీ మేలు మరచిపోలేమంటూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.శశికళ, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, టీపీ ఎంయూ ఏపీడీ వై.సత్యంనాయుడితో పాటు ఆయా గ్రామాలప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలి

- నేరసమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్


పాల్గొన్న అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్:

కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్‌లో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గంజాయి, సారా రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని, ఓపెన్ డ్రింకింగ్, డ్రంకన్ డ్రైవ్ విధిగా నిర్వహించాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కోర్టుల్లో ట్రయల్‌కు వచ్చిన కేసులను స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మార్కెటింగ్ చేసుకుంటూ ఉండాలని చెప్పారు. కోర్టు వాయిదాలకు సాక్షులు సక్రమంగా హాజరవుతున్నారా లేదా, వారిని ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తున్నారా? అన్న సమాచారాన్ని కోర్టు కానిస్టేబుల్ ద్వారా తెలుసుకుని సాక్షులు నిర్భయంగా జరిగిన వాస్తవాన్ని న్యాయమూర్తి ఎదుట ధైర్యంగా చెప్పేవిధంగా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలి

రోడ్డు ప్రమాదాల మీద సమీక్ష నిర్వహించిన ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తగు నిర్దేశాలు జారీచేశారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తరువాత ఫారం -1,5,7 లను నింపి సంబంధిత పత్రాలను జతచేసి ఐరాడ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి రోడ్డు భద్రత నియమాలపై వినూత్న రీతిలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

'సైబర్ నేరాలపై అవగాహన చేపట్టాలి

సైబర్ నేరాలపై దృష్టిసారించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు,. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులకు సైబర్ నేరాల గురించి విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలన్నారు.

ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. పాలకొండ సీఐ ఎం. చంద్రమౌళి, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్సై షణ్ముఖరావు, సీతానగరం ఎస్సై రాజేష్, సాలూరు టౌన్ పీసీ జి. చంద్రశేఖర్‌లు విధి నిర్వహణలో ప్రతిభ కనబరచడంతో వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ. దిలీప్ కిరణ్, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హర్షిత, పాలకొండ సబ్‌డివిజన్ డీఎస్పీ జీవీ కృష్ణారావు, ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీధర్, ట్రైనీ డీఎస్పీ ఎస్.ఎం.డి అజీజ్, ఏఆర్ డీఎస్పీ శేషాద్రి, ఎస్బీ సీఐ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ వాసునాయుడు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, జిల్లా సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ


రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో నంద్యాలలో జరిగిన పోటీల్లో నగరంలోని విన్ తైక్వాండో అకాడమీకి చెందిన 17 మంది క్రీడాకారులు పతకాలు దక్కించుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు దక్కించుకున్న వారిలో ఎం.చరణ్, సీహెచ్. సాన్విక, చేతన్, రుద్ర, హితేష్ వర్మ, వైభవ్‌లు ఉన్నారు. మిథున్, సుదర్శన్ సాయి, హేమచంద్ర, చందన, సమీరలు, రజత పతకాలు, ఎస్.కార్తీక్, కె.నిశ్చల్ కాంస్య పతకాలు దక్కించుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు దక్కించుకోవడంతో పాటు జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను కోచ్ పి.నేష్, ఎం .త్రినాథరావులు అభినందించారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు


జాతీయ తైక్వాండో పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని సవాయి మాదాపూర్‌లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన ఎం.గగన్ సాగర్ దొర బంగారు పతకాలు దక్కించుకున్నారు. అలాగే జి.గౌతమ్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు అభినందించారు.

మహిళా పోలీస్‌పై భర్త దాడి

పాలకొండ రూరల్: మండలంలోని వాటపాగు సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న కె.అంజలి, హార్టీకల్చర్ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న ఎ.యర్రన్న భార్యాభర్తలు. వారిద్దరి మధ్య మనస్పర్థల కారణంగా భార్యపై భర్త ఎర్రన్నాయుడు దాడికి పాల్పడ్డాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య కొనసాగుతున్న మాటలయుద్ధం గురువారానికి చినికిచినికి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో సచివాలయంలో ఉన్న అంజలిని ఆమె భర్త ఎత్తి కింద పడేయడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో స్పందించిన సహచర ఉద్యోగులు 108 వాహనంలో బాధితురాలిని ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు తలపై కుట్లు వేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపయోగించని చెక్కుబుక్‌లు రద్దు


చెక్కుబుక్‌లను ధ్వంసం చేస్తున్న అధికారులు

పార్వతీపురంటౌన్: ఉపయోగించని చెక్కుబుక్‌లను రద్దు చేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ట్రెజరీ అధికారి మన్మథరావు తెలిపారు. 2018 ఏప్రిల్‌కు ముందు చెక్కుబుక్‌లు ట్రెజరీలో అందుబాటులో ఉండేవని, 2018 ఏప్రిల్ నుంచి సీఎఫ్ఎంఎస్ విధానం అందుబాటులోకి వచ్చిన తరువాత చెక్కుబుక్‌లు, వాటికి సంబంధించిన వస్తువులు ప్రస్తుతం ఉపయోగించడం లేదని తెలిపారు. అటువంటి వాటిని జిల్లాస్థాయి కమిటీ వేసి రద్దుచేయాలని ప్రభుత్వం ఆదేశించిం, ఈ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. అందువల్ల 2018 ఏప్రిల్‌కు ముందు ఉపయోగించని, పనికిరాని చెక్కుబుక్‌లు, పాత సామగ్రిని జాయింట్ కలెక్టర్ గోవిందరావు ఆధ్వర్యంలో గురువారం రద్దుచేసి చెక్కుబుక్‌లను కాల్చివేసినట్లు చెప్పారు. కలెక్టరేట్ ఏఓ ఆర్.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి శ్రీనివాసరావు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు సబ్‌ట్రెజరీల అధికారులు పాల్గొన్నారు.

విజయనగరంలో..

విజయనగరం అర్బన్: ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 135 ప్రకారం ఖజానా కార్యాలయంలో భద్రపరచిన అనవసర, ఉపయోగంలో లేని పుస్తకాలను దహనం చేసేందుకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆధ్వర్యంలోని జిల్లా స్థాయి కమిటీ నిర్ణయించింది. ఈ కమిటీ ఆదేశాల మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఖజానా స్ట్రాంగ్ రూమ్ వద్ద వినియోగంలో లేని పుస్తకాలు, చెక్‌బుక్‌లను దహనం చేశారు.

పక్కాగా వంద రోజుల 'ఉపాధి' ప్రణాళిక


ఉపాధిహామీ సిబ్బందికి సూచనలు చేస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

పాలకొండ రూరల్: ఉపాధిహామీ వేతనదారులకు వంద రోజులు పనులు కల్పించేలా సిద్ధం చేసుకున్న ప్రణాళికను క్షేత్రస్థాయిలో అమలుచేయాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆదేశించారు. పాలకొండలోని ఉపాధి కార్యాలయంలో ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ సహాయకులతో గురువారం సమావేశమయ్యారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ మాట్లాడుతూ మండలంలో 32 పంచాయతీల్లో 40 పనులు జరుగుతున్నట్టు వివరించారు. రోజుకు 1629 మంది వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారన్నారు. రోజుకు 5వేల మందికి పనులు కల్పించేలా పనుల ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పీడీ మాట్లాడుతూ జాబ్‌కార్డు పొందిన ప్రతి కుటుంబానికి శతశాతం పనులు కల్పించాలన్నారు. హార్టీకల్చర్ అభివృద్ధిలో భాగంగా మొక్కలు నాటించడం, వాటి వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని పనుకువలస వద్ద చేపడుతున్న పంట కాలువల పనులు, హాజరైన వేతనదారుల వివరాలను పరిశీలించారు. ఆయన వెంట ఏపీడీ శ్రీహరి ఉన్నారు.

ఓటు విలువ చాటిచెప్పు




అయోధ్య మైదానంలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ఓటుహక్కు వినియోగించడం మన బాధ్యత
- జేసీ మయూర్ అశోక్
- ఉత్తమ అధికారులకు అవార్డుల ప్రదానం

విజయనగరం: ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ... జాతీయ ఓటర్ల దినోత్సవ స్ఫూర్తిని చాటిచెప్పేలా 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయనగరం జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఓటుహక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. వీధివీధినా అవగాహన కల్పించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ముఖ్య అతిథిగా హాజరై, అయోధ్యా మైదానంలో ఓటర్ల దినోత్సవాన్ని కార్యక్రమాలను ప్రారంభించారు. 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' నినాదాన్ని మానవ హారంతో ప్రదర్శించారు. విద్యార్థులు వివిధ రకా విన్యాసాలతో అలరించారు. బెలూన్లు ఎగురవేసి స్ఫూర్తిని చాటారు. మైదానం చుట్టూ విద్యార్థులు జాతీయ పతాకాలతో మానవహారం నిర్వహించారు. పులివేషాలు, కోలాటం, డప్పు వాయిద్యాలతో అయోధ్యా మైదానం హోరెత్తింది. అక్కడినుంచి భారీ ప్రదర్శన నిర్వహిస్తూ గురజాడ కళాక్షేత్రానికి చేరుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవడం మన బాధ్యత

ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతీపౌరుని బాధ్యత అని జేసీ మయూర్ అశోక్ అన్నారు. గురజాడ కళాక్షేత్రంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య మనుగడకు, దేశాభివృద్ధికి ఓటు మూలస్తంభం లాంటిదని పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించేందుకు 2011 నుంచి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఓటర్లందరూ ఓటుహక్కు వినియోగించుకొనేలా చైతన్య పరుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్వీప్ కార్యక్రమం కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రచార రథాన్ని ప్రారంభించారు. విజయనగరం కోట చుట్టూ మానవ హారాన్ని ఏర్పాటు చేసి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. భారత ముఖ్య ఎన్నికల నిర్వహణ అధికారి రాజీవ్ కుమార్ సందేశాన్ని వినిపించారు. సీనియర్ ఓటర్ మురళీలాల్ శర్మ, యువ ఓటర్ ఆదాడ మనోహర్, విభిన్న ప్రతిభావంతుడు డి.కొండబాబు, ట్రాన్స్ జెండర్ డి.మీనాలను సన్మానించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రశంసనీయంగా పనిచేసిన ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఎన్నికల డీటీలు, సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర 59 మందిని ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కళాకారులను, ఆహుతులను జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఎస్.డి.అనిత, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుదర్శనదొర, నూకరాజు, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, మెప్మా పీడీ సుధాకరరావు, విజయనగరం తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పలువురు జిల్లా అధికారులు, పీఈటీలు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


సాంస్కృతిక ప్రదర్శనలు


పులి వేషధారణ